సాక్షి విశాఖపట్నం

శనివారం । 1 । మార్చి । 2025

విద్యా రంగానికి అరకొరగా నిధులు



రాష్ట్ర బడ్జెట్‌లో రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం అమలు, జాతీయ విద్యా విధానంపై గాని ప్రకటించలేదు. కొఠారీ కమిషన్ రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం పాఠశాల విద్యకు కేటాయించాలని సూచించింది. ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 9.86 శాతం అనగా రూ.31,806 కోట్లు కేటాయించారు. ఇది విద్యారంగానికి ఏ మాత్రం సరిపోదు. కనీసం 20 శాతం అయినా కేటాయిస్తే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావడానికి అవకాశం ఉండేది.

– నరవ ప్రకాశరావు, స్టేట్ కన్వీనర్, ఆర్టీఈ ఫోరం

ఆటో డ్రైవర్లకు నిరాశే..



ఎన్నికల ముందు ఏటా రూ.15 వేలు చొప్పున డ్రైవర్లకు ఆర్థిక సాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డ్రైవర్లకు వాహన మిత్ర కింద ఏటా రూ.10వేలు సాయం అందించింది. చంద్రబాబు రూ.15 వేలు ఇస్తామంటే నిజమని నమ్మి ఓట్లు వేసి గెలిపించాం. కూటమి అధికారంలోకి వచ్చాక ఆటో డ్రైవర్లకు ఎటువంటి మేలు జరగలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపారు.

– జి.వామనమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్

పర్యాటకం ఊసే లేదు



బడ్జెట్‌లో విశాఖ పర్యాటకానికి నిధులు కేటాయించకపోవడం చాలా బాధాకరం. విశాఖకు పర్యాటకం ఒక ఆర్థిక వనరు. అటువంటి పర్యాటక రంగానికి బడ్జెట్‌లో ఎటువంటి నిధులు కేటాయించకపోవడం.. పర్యాటక రంగ అభివృద్ధికి వెన్నుపోటే. పర్యాటక రంగానికి భారీగా నిధులు కేటాయిస్తారని ఎదురు చూశాం. కానీ చివరికి కేటాయింపులు లేకుండా చేశారు.

– సీహెచ్ వెంకట్, మంగమారిపేట

బడ్జెట్‌లో కనిపించని వైజాగ్ జాడ


విశాఖను ఆర్థిక రాజధానిగా మారుస్తాం!

ఐటీకి విశాఖనే కేంద్రం!!

విశాఖలో విజయవాడతో పాటు మెట్రో పనులు ప్రారంభిస్తాం!!!

విశాఖ పర్యటనలో అటు సీఎం చంద్రబాబు, ఇటు మంత్రి లోకేష్‌లు ఊదరగొడుతూ పదే పదే చేసే మాటలు ఇవి. తీరా బడ్జెట్ కేటాయింపులు వచ్చే సరికి మాత్రం విశాఖ పేరునే ఉచ్చరించేందుకు తమకిష్టంలేదన్న రీతిలో వ్యవహరించారు. ఇటు విశాఖ మెట్రోకు కానీ, అటు విశాఖ పర్యాటక రంగానికి కానీ పూర్తిస్థాయిలో కేటాయింపులు లేవు. మరోవైపు ఏజెన్సీపైనా కూటమి ప్రభుత్వం చిన్నచూపు స్పష్టంగా కనిపించింది.

జీవీఎంసీకి పైసా విదల్చని ప్రభుత్వం



- వైజాగ్ మెట్రో ప్రాజెక్టు ఊసేదీ?
- ఏయూకూ పాత కేటాయింపులే..
- మెడికల్ కాలేజీలకు కేటాయింపులు నిల్
- పర్యాటక రంగానికి పడకేసిన నిధులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలో గత ప్రభుత్వ హయాంలో కొత్త బీచ్‌ల అభివృద్ధి, కొత్త రోడ్ల అభివృద్ధితో పాటు కొంగొత్త విశాఖను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. తాజాగా బడ్జెట్ పద్దులో విశాఖ పేరును ఐదుసార్లు ప్రస్తావించారు. స్మార్ట్ సిటీ కింద ఒక్క పైసా కేటాయించలేదని 3 సార్లు ప్రస్తావించగా.. ఇన్వెస్ట్‌మెంట్ టు ఇన్నోవేటివ్ ఇంటిగ్రేట్ అండ్ సస్టేన్ సిటీస్ కింద గత ఏడాదిలో రూ.20 కోట్ల మేర కేటాయిస్తున్నట్టు రెండు సార్లు ప్రస్తావించారు. అది కూడా గత ఏడాదిలో రూ. 26 కోట్లు కేటాయించగా... ఈ సారి తగ్గిస్తున్నట్టు చెప్పారు. వాస్తవానికి నగరంలో ఫ్లై ఓవర్లను నిర్మిస్తామని, భోగాపురం విమానాశ్రయానికి రహదారి నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా ఐటీకి విశాఖ నగరాన్ని కేంద్ర బిందువుగా మారుస్తామని కూడా హామీ ఇచ్చారు. అయితే ఆ మేరకు ఎక్కడా బడ్జెట్ కేటాయింపులు జరపలేదు.

మెట్రోరైలు ప్రాజెక్టు పట్టాలెక్కేదెట్లా...?

విశాఖ, విజయవాడలల్లో మెట్రో రైలు ప్రాజెక్టును చేపడతామని కూటమి నేతలు పదే పదే చెబుతూ వచ్చారు. అంతేకాకుండా విశాఖలో మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నట్టు హడావుడిగా ప్రకటించారు. మొదటి విడతలో మొత్తం 46.23 కిలోమీటర్ల మేర రూ.11,498 కోట్లతో మూడు కారిడార్లుగా అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. రెండో విడతలో రూ. 5,734 కోట్ల నిధులతో 30.67 కిలోమీటర్ల మేర మెట్రో రైలు ప్రాజెక్టును చేపడతామని ప్రకటించారు. తీరా చూస్తే మొత్తంగా ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం రూ.50 కోట్ల మేర ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులు కూడా అటు విజయవాడ, ఇటు వైజాగ్‌కు కలిపి కావడం గమనార్హం.

సాగునీటి ప్రాజెక్టులకు అంతంత మాత్రమే..!

ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు కూడా కనీస నిధులను కేటాయించలేదు. పెద్దేరు ప్రాజెక్టుకు రూ.2 కోట్లు,రైవాడకు రూ.75 లక్షలు, కోనాం ప్రాజెక్టుకు రూ.10 లక్షలు మాత్రమే కేటాయింపులు చేసింది. మరోవైపు ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి మాత్రం రూ. 605 కోట్ల మేర నిధులను కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన ప్రభుత్వం.. ఈ ఏడాదిలో కేటాయింపుల్లో ఏ మేరకు ఖర్చు చేయనుందనేది అనుమానమే. వాస్తవానికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.670 కోట్లు కేటాయిస్తామని గత జూలైలో ఎస్.రాయవరం వచ్చిన సందర్భంగా సీఎం చంద్రబాబు హామీనిచ్చారు. కేటాయింపుల్లో మాత్రం కోత విధించారు.

విద్య, వైద్యంపై శ్రద్ధేదీ.. ?

ఉత్తరాంధ్రలో ఉన్నత విద్యారంగానికి కేంద్రం ఆంధ్ర యూనివర్సిటీ. అటువంటి కీలకమైన యూనివర్సిటీకి నిధుల కేటాయింపులో ఒక్కపైసా అదనపు కేటాయింపులు కనిపించలేదు. గత ఏడాది బడ్జెట్ తరహాలోనే ఈ ఏడాది కూడా రూ. 389.34 కోట్లను మాత్రమే కేటాయించారు. విశాఖలోని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు కేవలం రూ.27.91 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో రూ. 59.48 కోట్ల మేర కేటాయించగా...ప్రస్తుత బడ్జెట్‌లో **సగానికిపైగా కేటాయింపులు తగ్గించారు. మరో**వైపు పాడేరు, నర్సీపట్నం మెడికల్ కాలేజీల అభివృద్ధి **ప్రస్తావన కూడా చేయకపోవడం గమనార్హం. పా**డేరు మెడికల్ కాలేజీతో పాటు అనకాపల్లి జిల్లాలో నర్సీప**ట్నంలో కూడా మెడికల్ కాలేజీల గురించి కూట**మి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు.

టూరిజానికి నిధులేవీ...!

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి బాగా అవకాశం ఉన్న ప్రాంతం **ఉమ్మడి విశాఖ జిల్లానే.** అటు ఏజెన్సీతో పాటు ఇటు నగరంలోని సముద్ర **తీరంలో అభివృద్ధి పను**లు చేపడితే దేశీయ పర్యాటకులతో పాటు విదేశీ పర్యా**టకులను కూడా మరింత** ఆకర్షించేందుకు అవకాశం ఉంటుంది. బడ్జెట్‌లో పర్యా**టక రంగానికి ఉమ్మడి విశాఖ** జిల్లాలో ఒక్క పైసా కూడా కేటాయించలేదు. కొత్త **బీచ్‌ల అభివృద్ధికి, ఏజెన్సీలో పర్యా**టక రంగ అభివృద్ధికి బడ్జెట్‌లో ఏ మాత్రం శ్రద్ధ **చూపించలేదు. గత ప్రభుత్వ హా**యాంలో విశాఖ పరిధిలో కొత్త బీచ్‌లను అభివృద్ధి చేయ**డంతో పాటు టీడీసీకి చెందిన హో**టల్ అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ **జిల్లా పర్యాటకరంగ అభివృద్ధికి** ఒక్క పైసా కూడా విదల్చకపోవడంపై విమర్శలు వ్యక్తమ**వుతున్నాయి.**

కేటాయింపులు సరే... ఖర్చేదీ?

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎంత మేర ఏయే పదులకు **ఖర్చు చేయ**నున్నారో అంచనాను తెలుపుతూ బడ్జెట్‌లో ఆయా **పద్దుల కింద** చూపుతుంటారు. సవరించిన అంచనాల పేరిట... వచ్చే **ఏడాది ప్రవేశపెట్టనున్న బడ్జెట్** సందర్భంగా ఫిబ్రవరి నెలలో పేర్కొంటుంటారు. అంతిమంగా ఎంత ఖర్చు చేశారనే అంశం మాత్రం... అటు వచ్చే ఏడాది బడ్జెట్‌లో అకౌంట్స్ పేరిట చూపుతుంటారు. వాస్తవిక అంచనాలకు... చివరి లెక్కలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ప్రధానంగా ఈ ప్రభుత్వం విశాఖ అభివృద్ధికి ఖర్చు చేయడంలో చాలా వ్యత్యాసం చూపుతోందని కొన్ని కేటాయింపులను గమనిస్తే ఇట్టే అర్థమవుతోంది. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి గత బడ్జెట్‌లో రూ. 841 కోట్ల మేర కేటాయించి.. కేవలం రూ. 259 కోట్లను మాత్రమే ఖర్చు చేయనున్నట్టు సవరించిన అంచనాల్లో ప్రభుత్వం పేర్కొంది. అయితే, మార్చి చివరి నాటికి కచ్చితమైన లెక్కలు తీస్తే... అంతిమంగా ఈ వ్యయం కాస్తా రూ. 100 కోట్లను కూడా దాటే అవకాశం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక ఈ ఏడాది కూడా బడ్జెట్‌లో రూ. 847 కోట్ల మేర కేటాయింపులు జరిపింది. అయితే, వాస్తవంగా ఎంత మేర ఖర్చు చేస్తుందనేది అనుమానమే. ఇక మెడ్‌టెక్ జోన్‌కు గత ఏడాది బడ్జెట్‌లో రూ. 34 కోట్లు కేటాయించి... నయా పైసా కూడా ఖర్చు చేయలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా రూ. 34 కోట్ల మేర కేటాయింపులు చేసింది. భోగాపురం విమానాశ్రయానికి కూడా గత ఏడాది బడ్జెట్‌లో రూ. 147.42 కోట్లు కేటాయించినప్పటికీ వ్యయంలో మాత్రం రూ. 16.15 కోట్లు మాత్రమే సాధ్యపడింది. ఇక ప్రస్తుత బడ్జెట్‌లో రూ.195 కోట్ల మేర కేటాయింపులు చేసింది. ఇందులో వాస్తవిక వ్యయం ఎంత మేర ఉంటుందనేది వచ్చే ఏడాది బడ్జెట్‌లో బయటపడనుంది.

వివాదాలు.. రాజకీయాలు

- మనకబారుతున్న ఏయూ ప్రతిష్ట
- ఆంధ్రా యూనివర్సిటీపై కూటమి రాజకీయ పెత్తనం
- కొత్త వీసీ రాజశేఖర్‌కు సమస్యల స్వాగతం
- నేడు బాధ్యతల స్వీకరణ

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీకి ఘనమైన చరిత్ర ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వర్సిటీలో రాజకీయ పెత్తనం ఎక్కువైంది. ఆచార్యులు రెండు వర్గాలుగా విడిపోయి ఆధిపత్యం కోసం ఆరాటపడుతున్నారు. శనివారం వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఖరగ్‌పూర్ ఐఐటీ ప్రొఫెసర్ జి.రాజశేఖర్‌కు వర్సిటీలోని అనేక సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కలిపి 2,010 మంది వరకు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.16 కోట్లు జీతాల రూపేణా చెల్లిస్తున్నారు. పెన్షనర్స్ 3,500 మంది వరకు ఉన్నారు. వీరికి నెలకు రూ.17.50 కోట్లు అవసరం ఉంటుంది. జీతాల చెల్లింపు కోసమని ప్రతి నెలా వర్సిటీ అధికారులు బిల్లులు చేసి, ప్రభుత్వానికి నివేదిస్తున్నా, సకాలంలో మంజూరు కావడం లేదు. యూనివర్సిటీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి సైతం ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. రిటైర్ అయిన వారికి రూ.43 కోట్లు వరకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. పాత వీసీ ప్రసాద్‌రెడ్డి ఏర్పాటు చేశారనే ఒక్క కారణంతో టీడీఆర్ హబ్‌ను మూసేయాలని వర్సిటీలోని కొన్ని వ్యతిరేక శక్తులు కక్ష కట్టారు. యూజీసీ నిబంధనలు మేరకు ఏపీఆర్ సెట్ నుంచి 680 మంది, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో 72 మంది రీసెర్చ్ స్కాలర్స్ అడ్మిషన్లు పొందగా, వారికి పరీక్షల నిర్వహణలో రోజుకో రీతిన నిర్ణయాలు తీసుకుంటూ, వర్సిటీ ఖ్యాతి బజారునపడేస్తున్నారు. వసతి గృహాల్లో సమస్యలు తిష్టవేశాయి. స్కాలర్‌షిప్పులు రాలేదనే కారణంతో సరైన భోజనం పెట్టడం లేదు. విద్యుత్ బిల్లుల భారం విద్యార్థులపైనే వేస్తున్నారు. క్యాంపస్ కాలేజీల్లో పాఠాలు బోధనకు ఆచార్యుల కొరత తీవ్రంగా ఉంది. ప్రత్యామ్నాయంగా 400 మంది వరకు గెస్ట్ ఫ్యాకల్టీలను నియమించారు. కొన్ని విభాగాల్లో అవసరం లేకున్నా, కూటమి నేతల సిఫార్సులతో చేరిపోయారు. నేడు వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్ వీటిని గాడిలో పెడతారా? యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడతారా? అన్నది వేచి చూడాలి.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఫస్టియర్, 3 నుంచి సెకండ్ ఇయర్ పరీక్షలు
- హాజరుకానున్న 83,001 మంది విద్యార్థులు
- జిల్లాలో 87 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

విశాఖ విద్య : ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. శనివారం ఫస్టియర్ విద్యార్థులకు పరీక్ష ప్రారంభం కానుంది. సోమవారం నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరుగుతాయి. జిల్లాలో 165 జూనియర్ కాలేజీల నుంచి జనరల్, ఒకేషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. మొదటి సంవత్సరం 42,257 మంది పరీక్షలు రాస్తుండగా, వీరిలో బాలురు 22,464 మంది, బాలికలు 19,793 మంది ఉన్నారు. అదేవిధంగా రెండో సంవత్సరం మొత్తం 40,744 మంది హాజరవుతున్నారు. సెకండ్ ఇయర్ 37,943 మంది రెగ్యులర్‌గా, 2,291 మంది ప్రైవేటుగా పరీక్షలు రాస్తున్నారు. వీరిలో బాలురు 21,464 మంది, బాలికలు 19,280 మంది ఉన్నారు. మొదటి, రెండు సంవత్సరాలు కలిపి మొత్తం 83,001 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. జంబ్లింగ్ విధానంలో జరిగే పరీక్షలకు జిల్లాలో 87 కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించరు. మరోవైపు సీసీ కెమెరాల పర్యవేక్షణలో కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆర్ఐవో కార్యాలయంతో పాటు, ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశారు. వీటిని నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక సిబ్బందికి విధులు కేటాయించారు. విశాఖపట్నం కేంద్రంగా ఆర్ఐవో కార్యాలయంలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు 0891 2567561కు ఫోన్ చేస్తే, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు సత్వరమే స్పందించి, సమస్య పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాను ఏడు జోన్లుగా విభజించారు. జిల్లాలో 87 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రతీ కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించారు.

ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడికి యత్నం

అక్కిరెడ్డిపాలెం: ఐదేళ్ల చిన్నారిపై 50 ఏళ్ల వ్యక్తి లైంగికదాడికి యత్నించాడు. బాధిత కుటుంబం, గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతగాజువాక గోకుల్‌నగర్‌కు చెందిన సన్నిబాబు స్థానికంగా ఉన్న ఒక సెల్ షాపులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలో ఒక ఇంటి మేడపై నివాసం ఉంటున్నాడు. శుక్రవారం దిగువ పోర్షన్‌లో నివాసం ఉంటున్న ఐదేళ్ల చిన్నారిని సన్నిబాబు మేడ మీదకు తీసుకువెళ్లాడు. చాలా సేపటి నుంచి పాప కనిపించకపోవడంతో తల్లి నారాయణమ్మ మేడపైకి వెళ్లింది. ఈ సమయంలో చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడుతున్న సమయంలో గట్టిగా కేకలు వేయడంతో సన్నిబాబు పారిపోవడానికి ప్రయత్నించాడు. స్థానికుల సాయంతో సన్నిబాబును గాజువాక పోలీసులకు అప్పగించారు. నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సన్నిబాబును అదుపులోకి తీసుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ స్లాగ్ పిట్‌లో పేలుడు

సాక్షి, విశాఖపట్నం : స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1కు చెందిన స్లాగ్‌పిట్‌లో శుక్రవారం పేలుడు సంభవించింది. ప్రత్యక్షసాక్షుల సమాచారం మేరకు వివరాలివి.. ఉక్కు ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా ద్రవపు ఉక్కు సీసీడీకు పంపుతుండగా అందులో తయారయ్యే స్లాగ్‌ను స్లాగ్ యార్డ్ పిట్‌కు తరలిస్తారు. యథావిధిగా శుక్రవారం ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా స్లాగ్‌ను స్లాగ్ పిట్‌కు తరలించారు. స్లాగ్ పిట్‌లో కొద్దిపాటి నీరు ఉండటంతో స్లాగ్ వేడికి పిట్‌లో పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఉధృతికి పై కప్పు రెండు వైపులా ఉండే రేకులు ధ్వంసమయ్యాయి. పేలుడు సంభవించడానికి కొద్ది సేపు ముందే అక్కడ ఉండాల్సిన ఉద్యోగి, కాంట్రాక్ట్ కార్మికులు పనులు ముగించుకుని వెళ్లడంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఈ ప్రమాదం వల్ల ఉత్పత్తికి ఎటువంటి అంతరాయం కలగలేదు.

బకాయిలు చెల్లించకపోతే ఆమరణదీక్ష

టీడీపీ నేత కంచర్ల అచ్చుతరావుకు ఏపీ నిరుద్యోగ జేఏసీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ హెచ్చరిక



మాట్లాడుతున్న విజయ్ రఘునాథ భట్ల

సీతమ్మధార: తెలుగుదేశం నాయకుడు, పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు మూడేళ్ల వేతనాల బకాయిలను మార్చి 2లోపు చెల్లించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ఏపీ నిరుద్యోగ జేఏసీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ రఘునాథ భట్ల తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం మీడియా సమావేశం జరగాల్సి ఉండగా అచ్యుతరావు అనుచరులు సమావేశం పెట్టకుండా బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ రఘునాథ భట్ల ఓ వీడియోతో పాటు ప్రకటన విడుదల చేశారు. 2022లో కంచర్ల అచ్యుతరావు ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై ఐపీసీ 369 చిత్రాన్ని, అదే బ్యానర్‌లో 3వ చిత్రంగా తన దర్శకత్వంలో ప్రారంభించామని తెలిపారు. అనేక సందర్భాలలో షూటింగ్ ప్రారంభిస్తున్నామని చెబుతూ దాదాపు మూడేళ్ల కాలంగా దాటవేస్తున్నారన్నారు. మూడేళ్ల నుంచి వేతనాలు అడుగుతున్నా ఎటువంటి ప్రయోజనం లేకపోగా మా టీం సభ్యుల నంబర్లను బ్లాక్‌లో పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్చి 2లోగా న్యాయం జరగకపోతే 3నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ఆయన హెచ్చరించారు.

బార్లలో ఆకస్మిక తనిఖీలు



పెందుర్తి బార్‌లో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఆరిలోవ: జిల్లాలో ఎక్సైజ్ శాఖ అధికారులు శుక్రవారం రాత్రి బార్లపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గాజువాక, పెందుర్తి, సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, భీమిలి ఎక్సైజ్ స్టేషన్ల సీఐల ఆధ్వర్యంలో వాటి పరిధిలో ఉన్న 117 బార్లలో రికార్డులు పరిశీలించారు. సాధారణంగా ప్రతి మూడు నెలలకు ఓసారి బార్లు తనిఖీ చేస్తారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో రెండు రోజుల పాటు బార్లు మూతపడిన విషయం తెలిసిందే. పోలింగ్ ముగిసిన అనంతరం శుక్రవారం బార్లు తెరుచుకొన్న స్టాక్‌ను తనిఖీ చేశారు. ఎమ్మెల్సీ పోలింగ్‌కు ముందు బార్లు మూతపడిన సమయానికి ఉన్న స్టాక్, పోలింగ్ అనంతరం తెరిచిన సమయానికి ఉన్న స్టాక్ సరిపోయిందా లేదా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని తెలిపారు. బార్ యజమానులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

సింహాచలం ఇన్‌చార్జి ఈవోగా సుబ్బారావు

సెలవుపై అమెరికా వెళ్తున్న ఈవో త్రినాథరావు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా రాష్ట్ర దేవదాయశాఖ రాజమహేంద్రవరం మల్టీ జోన్–1 రీజినల్ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కలెక్టర్ కె.సుబ్బారావు నియమితులయ్యారు. దేవస్థానం ప్రస్తుత ఈవో వి.త్రినాథరావు 92 రోజుల పాటు వ్యక్తిగత సెలవుపై అమెరికా వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని ఇటీవల దేవదాయశాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది మార్చి 1 నుంచి మే 31 వరకు ఆయనకు దేవదాయశాఖ సెలవు మంజూరు చేసింది. దీంతో రాజమహేంద్రవరం ఆర్జేసీ కె.సుబ్బారావుకి 92 రోజులపాటు సింహాచలం దేవస్థానం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను దేవదాయశాఖ అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ కె.వినయ్‌చంద్ జీవో జారీ చేశారు. కాగా సింహాచలం దేవస్థానంలో రానున్న ఏప్రిల్ 8న స్వామి వార్షిక కల్యాణోత్సవం, ఏప్రిల్ 30న చందనోత్సవం జరగనున్నాయి. ఆ రెండు ప్రధాన ఉత్సవాలు ఇన్‌చార్జి ఈవో హయాంలోనే జరగనున్నాయి.